# తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక 6వ అధ్యాయము

## బానిసలు

దేవుని నామమును ఆయన బోధయు దూషింపబడకుండనట్లు దాసత్వమను కాడి క్రింద ఉన్న వారందరును, తమ యజమానులు పూర్ణమైన ఘనతకు పాత్రులని ఎంచవలెను. 2 విశ్వాసులైన యజమానులు గల దాసులు తమ యజమానులు సహోదరులని వారిని తృణీకరింపక తమ సేవా ఫలము పొందువారు విశ్వాసులును ప్రియులునై యున్నారని మరి ఎక్కువగా వారికి సేవచేయవలెను ఈ సంగతులు బోధించుచు వారిని హెచ్చరించుము.

## అబద్ధ బోధలు

3 ఎవడైనను మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క హిత వాక్యములను దైవభక్తికి అనుగుణ్యమైన బోధను అంగీకరింపక భిన్నమైన బోధనుపదేశించిన యెడల, 4 వాడేమియు ఎరుగక తర్కములను గూర్చియు వాగ్వాదములను గూర్చియు వ్యర్థముగా ప్రయాసపడుచు గర్వాంధుడగును. వీటి మూలముగా అసూయ కలహము దూషణలు దురనుమానములును 5 చెడిపోయిన మనస్సు కలిగి సత్యహీనులై దైవభక్తి లాభ సాధనమనుకొను మనుష్యుల వ్యర్థ వివాదములును కలుగుచున్నవి.

## నిజమైన ధనము

6 సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనమైయున్నది. 7 మనమీ లోకములోని కేమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసుకొని పోలేము. 8 కాగా, అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తి పొంది యుందము. 9 ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను అవివేక యుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచి వేయును. 10 ఎందుకనగా, ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి, నానా బాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి.

## తిమోతి కొరకైన పౌలు హెచ్చరికలు

11 దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి, నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము. 12 విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము. నిత్య జీవమును చేపట్టుము దాని పొందుటకు నీవు పిలువబడి అనేక సాక్షుల యెదుట మంచి ఒప్పుకోలు ఒప్పుకొంటివి. 13 సమస్తమునకు జీవాధారకుడైన దేవుని యెదుటను పొంతి పిలాతునొద్ద ధైర్యముగా ఒప్పుకొని సాక్ష్యమిచ్చిన క్రీస్తుయేసు యెదుటను 14 మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రత్యక్షమగునంత వరకును నీవు నిష్కళంకముగాను, అనింద్యముగాను ఈ ఆజ్ఞను గైకొనవలెనని నీకు ఆజ్ఞాపించుచున్నాను. 15 శ్రీమంతుడును అద్వితీయుడునగు సర్వాధిపతి యుక్త కాలములయందు ఆ ప్రత్యక్షతను కనుపరచును. ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు. 16 సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు, అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో ఎవడును ఆయనను చూడలేదు. ఎవడును చూడనేరడు ఆయనకు ఘనతయు శాశ్వతమైన ప్రభావమును కలిగి ఉండును గాక, ఆమేన్.

17 ఇహమందు ధనవంతులైన వారు గర్విష్ఠులు కాక, అస్థిరమైన ధనమందు నమ్మికయుంచక, సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు దారాళముగా దయచేయు దేవుని యందే నమ్మిక యుంచుడని ఆజ్ఞాపించుము. 18 వారు వాస్తవమైన జీవమును సంపాదించుకొను నిమిత్తము, రాబోవు కాలమునకు మంచి పునాది తమకొరకు వేసికొనుచు, మేలు చేయువారును, 19 సత్క్రియలు అను ధనము గలవారును, ఔదార్యము గలవారును తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము. 20. ఓ తిమోతీ, నీకు అప్పగింపబడిన దానిని కాపాడుము అపవిత్రమైన వట్టి మాటలకును జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాదములకును దూరముగా ఉండుము. 21. ఆ విషయములో ప్రవీణులమని కొందరునుకొని విశ్వాస విషయము తప్పిపోయిరి. కృప మీకు తోడైయుండును గాక.